క్లుప్తంగా

నేడు అర్వపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఎన్నికల ప్రచారం శుక్రవారం ఉదయం 10గంటలకు అర్వపల్లిలో ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్థానిక వైజంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రచారానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూత్ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని ఏపూరు గ్రామంలో స్నేహ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్ష కార్యదర్శులు పోకబత్తిని వంశీ, కల్లెపల్లి కిరణ్ మాట్లాడారు. ఎండాకాలంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సూర్యాపేట పట్టణం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఏపూరు కూడలిగా ఉంటుందని, ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు పోకబత్తిని నవీన్, కస్తూరి నాగరాజు బోయిళ్ల రంజిత్, వర్ధ రాము, కస్తూరి నరేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

హోటల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

సూర్యాపేట: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఓ హోటల్‌లో గురువారం గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది శంకర్, పురుషోత్తం, కృష్ణప్రభాకర్ మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రభాకర్‌రావు మృతికి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తొండ గ్రామానికి చెందిన సిటీ సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు నెమురుగొమ్ముల గౌతమ్‌రావు తండ్రి ప్రభాకర్‌రావు ఇటీవల మృతి చెందారు. గురువారం తొండ గ్రామంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చెరువు మట్టి తరలిస్తే చర్యలు తప్పవు



పల్లెచెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టి

తుంగతుర్తి : మండల కేంద్రం శివారులో ఉన్న పల్లెచెరువు నుంచి మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుండగా గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు గురువారం అడ్డగించారు. అనంతరం గంగపుత్ర సంఘం సభ్యులు కలెక్టర్ వెంకటరావుకు ఫొటోలు పంపి విషయాన్ని తెలియజేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి తహసీల్దార్ రమణారెడ్డికి సమాచారం అందించి మట్టిని తరలించకుండా చూడాలని ఆదేశించి పనులు నిలిపివేయించారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

5వ తరగతిలో ప్రవేశాలకు 20న లక్కీడ్రా

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం పాఠశాలలో ఈనెల 20న లక్కీ డ్రా తీయనున్నట్లు ప్రిన్సిపాల్ రెహానా బేగం గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం 12 గంటల వరకు హాజరు కావాలని కోరారు. తల్లిదండ్రుల సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

జోరందుకున్న 'ఉపాధి' పనులు

- పంటకాల్వల మరమ్మతులకే ఎక్కువ ప్రాధాన్యం
- కూలి రేట్లు పెంచడంతో మరింత ఉత్సాహం
- అధికంగా హాజరవుతున్న మహిళలు



సింగారెడ్డిపాలెంలో పంట కాలువ పనులు చేస్తున్న కూలీలు

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తికావడంతో రైతులు, కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి 365రోజులు పని కల్పించడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మండలంలో ఉపాధిహామీ పథకం కింద చెరువులు, కుంటల్లో పూడకతీత, పంట కాల్వల మరమ్మతు పనులు ఎక్కువగా చేపడుతున్నారు. మండు టెండలను లెక్కచేయకుండా కూలీలు పనులు చేస్తుండగా..ఈ పనులకు ఎక్కువగా మహిళలే హాజరవుతున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు మస్టర్లు, కొలతలు వేసి బిల్లులు జమచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు కూలి పెంచడంతో రోజుకు రూ.300వరకు కూలీ వచ్చేలా పనులు చేస్తున్నారు.

3863మంది కూలీలు హాజరు..

మండలంలో 29 గ్రామపంచాయతీల నుంచి ప్రతిరోజు 3863 మంది కూలీలు చెరువుల్లో పూడికతీత, పంట కాలువల పనులకు హాజరవుతుండగా అందుల్లో దాదాపు 2320మంది మహిళా కూలీలే ఉండటం విశేషం. అయితే రైతులు కూడా జాబ్ కార్డు ద్వారా తమ పంట కాలువల్లో పూడిక తీత, కంపచెట్ల తొలగింపు వంటి పనులు చేయించుకుంటున్నారు. వేసవి నేపథ్యంలో పనిప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

ఆర్థికంగా తోడ్పాటు..

గతంలో కేంద్ర ప్రభుత్వం కూలీలకు తట్ట, పార, గడ్డపార, మంచినీళ్లకు మొత్తం కలిపి రూ.30లు రోజువారీ వేతనంలో జమ చేయగా ఇప్పుడు అలా జమకావడం లేదు. రోజుకు కనీస వేతనంగా రూ.300ఇవ్వాలనే అధికారులు కృషి చేస్తున్నారు. కూలీలకు అవగాహన కల్పిస్తుండడంతో రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతోంది. దీంతో పనితో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందుతోంది.

పనులకు రోజూ వెళ్తున్నాం

"ప్రతి రోజు ఉపాధి పనులకు వెళ్తున్నాం. మహిళలందరూ జట్టుకట్టి పోటీగా పనిచేస్తున్నాం. టీంల వారీగా పంట కాల్వల పని, చెరువుల్లో పూడిక తీత, వరద కాలువలు, వ్యవసాయ భూముల డొండదారుల వెంట చెట్లతొలగింపు వంటి పనిచేస్తున్నాం.

– వెంకటమ్మ, కూలీ, సింగారెడ్డిపాలెం

ప్రతి ఒక్కరికి పనికల్పిస్తాం



"జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి పనికి కావాల్సిన పత్రాలు అందిస్తే వెంటనే పని కల్పిస్తాం. కొలతలు, మస్టర్ల ప్రకారం బిల్లులు వెంటనే అందజేస్తాం. ఇప్పటికే పంట కాల్వలు, చెరువుల పూడిక తీత, వరద కాలువలు, వ్యవసాయ భూముల రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి.

– రవి, ఏపీఓ

కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు మేలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని చింతలచెరువుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బైరబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో రమేష్‌రెడ్డి సమక్షంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తుందన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే పేద ప్రజలకు కావాల్సిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం దక్కుతుందన్నారు. చింతలచెరువులో ఇళ్లు, పెన్షన్ల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారని అన్నారు. తాను ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకొని పేదలకు ఇల్లు కట్టిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పేదల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీవుల్లా, గట్టు శ్రీనివాస్, గోదాల రంగారెడ్డి, జానకిరాములు, స్వామినాయుడు, శ్రీనివాస్, కర్ణాకర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



వేదాంత భజనమందిరంలో శ్రీరాముడికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని వేదాంత భజన మందిరంలో శ్రీరాముడి పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజు పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే గణపతి పూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి మధ్యాహ్నం అర్చకులు భక్తుల నడుమ పట్టాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం హనుమాన్ వాహనంపై శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తహసీల్దార్, మండల నోడల్ అధికారి జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. గురువారం అర్వపల్లిలోని సెర్ఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 19కేంద్రాల నుంచి 578మంది రైతుల నుంచి 48.305 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సెర్ఫ్ నుంచి 35వేల క్వింటాలు, పీఏసీఎస్ నుంచి 1,350 క్వింటాలు, రైతు సంఘాల నుంచి 11,955 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి కేంద్రాలకు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రావి శశిధర్‌రెడ్డి, సెర్ఫ్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఈఓ శోభారాణి, వీఓఏ కృష్ణకుమారి, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు, హమాలీలకు అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ చరణ్

అర్వపల్లి : ఎండల దృష్ట్యా ఉపాధిహామీ కూలీలు, హమాలీలు ఉదయం వేళల్లోనే పనులు ముగించుకోవాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్.చరణ్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం ఉపాధి కూలీలు, హమాలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండల్లో బయటకు వెళ్లొద్దని అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళితే కాటన్ దుస్తులు ధరించాలని, టోపీ, లేదా గొడుగు పెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై విక్రయించే చల్లని పానియాలను తాగొద్దన్నారు. గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవులపల్లి నవీన్‌రెడ్డి, ఎంపీహెచ్ఏ ఎంవై దుర్గ, ఆశకార్యకర్త బి.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం



సమావేశంలో ప్రగతి నివేదిక చదువుతున్న పశువైద్యాధికారి మధు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నామ మాత్రంగా సాగింది. మొత్తం తొమ్మిది మంది సభ్యులకు గాను ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ డెక్కం లలితమ్మ మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం పూర్తి కావడంతో సమావేశం కొనసాగించారు. 23 శాఖల అధికారులకు గాను మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరై తమ ప్రగతి నివేదికలను చదివి కూర్చున్నారు. మొత్తం మీద సమావేశంలో ప్రజల సమస్యలను ప్రస్తావించే వారు కరువయ్యారు. సమావేశంలో ఎండీఓ పవన్ కుమార్, ఎంపీఓ జగదీష్, ఏపీఓ జ్యోతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైదులు మృతి సీపీఎంకు తీరనిలోటు



సైదులు మృతదేహంపై పార్టీ కండువా కప్పుతున్న నాయకులు

మునగాల: మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు రాయి సైదులు మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య అన్నారు. గురువారం అనారోగ్య కారణాలతో మృతిచెందిన సైదులు మృతదేహంపై ఆయన ఎర్రజెండా కప్పి నివాళులర్పించి మాట్లాడారు. సైదులు చిన్నతనం నుంచి ఎర్రజెండా నాయకత్వాన జరిగిన పోరాటాల్లో చురుకైన కార్యకర్తగా పనిచేశారని గుర్తు చేశారు. సైదులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి, మామిడి గోపయ్య, పార్టీ గ్రామశాఖ కార్యదర్శి బట్టుపల్లి ఉపేందర్, నాయకులు బచ్చలకూరి సుధాకర్, జలగం జీడయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి సికిందర్, నాయకులు బి.గోవర్ధన్, కె.రాములు, ఆర్.వెంకటరత్నం, బి.గుర్వయ్య, ఆర్.రాజశేఖర్, ఆర్.నాగేశ్వరరావు, ఆర్.శ్రీను, వి.నర్సయ్య, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్ట సంరక్షణ సీపీఎంతోనే సాధ్యం



మద్దిరాల : గోరెంట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి



అర్వపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న యాకలక్ష్మి

మద్దిరాల : పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకోవాలంటే అది సీపీఎం పార్టీతోనే సాధ్యమవుతుందని, అందుకు భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో పార్లమెంట్ అభ్యర్థి ప్రచారంలో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో సీపీఎం పోరాట ఫలితంగానే దేశంలో పేదలకు ఉపాధిహామీ చట్టం వచ్చిందని గుర్తుచేశారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. దశల వారిగా ఉపాధిహామీ చట్టానికి నిధుల్లో కోత విధిస్తూ పేదల బతుకులకు బరోసా లేకుండా చేస్తుందన్నారు. ఉపాధిహామీ కూలీలకు సంవత్సరానికి 200రోజులు పనిదినాలను కల్పించి రోజుకు రూ.600లను కూలీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి, నాయకులు కందాల శంకర్‌రెడ్డి, కొప్పుల రజిత, నరసింహారావు, పోలొజు సైదులు, మల్లారెడ్డి, శ్రీను, వీరన్న, రంగయ్య, వెంకన్న, సోమయ్య, మల్సూర్, శోభ, నాగమ్మ, సోమలక్ష్మి, ధనమ్మ, సునీత, మంగమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే వారినే గెలిపించాలి

నూతనకల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి కోరారు. గురువారం మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 30ఏళ్లుగా విద్యార్థి, యువజన సంఘాల్లో క్రియాశీలక కార్యకర్తగా పనిచేసి రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పోరాటాల్లో ముందుండి పోరాడిన వ్యక్తి అని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనలో సామాన్య ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని, కార్పొరేట్ శక్తుల ఆస్తులు మాత్రమే పెరిగాయని విమర్శించారు. బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట గోపి, కొప్పుల రజిత, నర్సింహారావు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడేది సీపీఎం తప్ప మరేపార్టీ కాదన్నారు. ఉపాధిహామీ పథకం చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ఘనత సీపీఎందేనని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి, మండల నాయకులు వజ్జె సైదులు, అబ్బులు, శ్రీను, గ్రామ కార్యదర్శి వెంకన్న, వీరస్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవి

భానుపురి (సూర్యాపేట) : పోస్టల్ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ రవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సూర్యాపేట పోస్టల్ డివిజన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వజ్ర సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చిన్నమొత్తాల పొదుపుతో నడిచే స్కీమ్‌లను తెలియజేయాలన్నారు. ఈ విషయంలో గ్రామీణ స్థాయిలో ఉండే బీపీఓలదే కీలక పాత్ర అని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, పోస్ట్‌మాస్టర్ సునీల్‌కుమార్, ఐపీఓలు సురేష్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం : మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్.హుస్సేన్ తండ్రి షేక్ ఇమామ్‌సాబ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పొదిల రమేష్, కూరం వెంకన్న, సుధాకర్, షేక్ నాగుల్ మీరా, సైదులు, శ్రీను, తీగుళ్ల యాదగిరి, బాలస్వామి, హుస్సేన్, జానీపాషా పాల్గొన్నారు.

బౌద్ధ శిల్ప సంపదను వారసత్వంగా గుర్తించాలి

నాగారం : ఐక్యరాజ్య సమితి జరిపే ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రం వద్ద లభించిన బౌద్ధ వారసత్వ సంపదను, బుద్ధుడి స్మారక కట్టడాలను, శిల్ప సంపదలను వారసత్వ శిల్ప సంపదగా గుర్తించాలని బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లుయాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వరంగల్ జిల్లాలోని రామప్పగుడిని వారసత్వ సంపద ఎలా గుర్తించారో అదే విధంగా ఫణిగిరిలో లభించిన బౌద్ధ సందను యునెస్కో వారు గుర్తించాలని కోరారు. ఫణిగిరిలో అద్భుతమైన బౌద్ధ శిల్పసంపద ఉందని యునెస్కో వారు గోల్కొండ కుతుబ్షాహీ టూంబ్స్ మాదిరిగా వారసత్వ ప్రదేశ సంపదగా బౌద్ధ క్షేత్రాన్ని గుర్తించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి నిధులు

- రూ.11.11లక్షలు మంజూరు
- పాత చేతిపంపులు, పూడిపోయిన బోర్ల మరమ్మతులకు వినియోగం
- ముమ్మరంగా సాగుతున్న పనులు



అర్వపల్లి సంతలో బోరును ఫ్లైషింగ్ చేయిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది



వేల్పుచర్లలో చేతిపంపుకు కొత్త పనిముట్లు బిగిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎస్‌డీఎఫ్ ద్వారా మండలానికి రూ.21.50లక్షలు మంజూరు కాగా కొత్తగా బోర్లు వేయడం, పైపులైన్లు బిగించడం తదితర పనులు చేపట్టారు. ఈ నిధులతో పాటు తాజాగా మిషన్ భగీరథ ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) ద్వారా మండలానికి మరో రూ.11.11లక్షలు మంజూరయ్యాయి. గ్రామాల్లో గత కొంత కాలంగా చేతి పంపులు కొన్ని తుప్పుపట్టి వినియోగంలో లేకుండా పోయాయి. కాగా గతంలో వేసిన రక్షిత మంచినీటి పథకాల బోర్లు మట్టితో పూడిపోవడంతో పాటు నీళ్లు అడుగంటిపోయాయి. ప్రస్తుతం అవి పనిచేస్తున్నప్పటికీ తక్కువ నీళ్లు వస్తున్నాయి. దీంతో అధికారులు మిషన్ భగీరథ ఓఅండ్ఎం నిధులతో వాటి మరమ్మతులు చేపడుతున్నారు.

మిషన్ భగీరథ ఓఅండ్ఎం నిధులతో..

మండలానికి మిషన్ భగీరథ ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) ద్వారా మంజూరైన రూ.11.11లక్షలతో వివిధ గ్రామాల్లో పనిచేయని 22చేతిపంపుల మరమ్మతు చేపట్టారు. అలాగే తుప్పుపట్టిపోయిన పనిముట్లను తీసివేసి చేతి పంపులకు కొత్త పనిముట్లు బిగిస్తున్నారు. అలాగే వివిధ గ్రామాల్లో గతంలో వేసిన రక్షిత మంచినీటి పథకాల బోర్లు మట్టితో పూడటంతో పాటు నీరు అడుగంటిపోవడంతో ఈ బోర్లను ఫ్లైషింగ్ చేయిస్తున్నారు. ముఖ్యంగా చేతిపంపుల మరమ్మతుతో కరెంట్ లేని సమయాల్లో ప్రజలు ఈ పంపుల నీటిని వాడుకోనున్నారు. కాగా ఈ నిధులతో గ్రామాల్లో చేతి పంపుల మరమ్మతు, బోర్ల ఫ్లైషింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎంతో కాలంగా తుప్పుపట్టి పనిచేయని చేతిపంపులకు కొత్త పనిముట్లు బిగించి వినియోగంలోకి తెస్తున్నారు.

మరమ్మతు పనులు జరుగుతున్నాయి



"మిషన్ భగీరథ ఓఅండ్ఎం నిధులు మండలానికి రూ.11.11లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 23పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో చేతిపంపుల మరమ్మతు, రక్షిత మంచినటి పథకం బోర్ల ఫ్లైషింగ్, కొత్త మోటార్ల ఏర్పాటు చేట్టాల్సి ఉండగా ఇప్పటికే 16పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులు కూడా జరుగుతున్నాయి. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నాం.

– మహేష్, మిషన్‌భగీరథ ఏఈ

చేతిపంపును వినియోగంలోకి తెచ్చారు



"జాజిరెడ్డిగూడెంలోని కేశవాపురం కట్టపై గుడివద్ద ఉన్న చేతిపంపు తుప్పుపట్టి కొంత కాలంగా పనిచేయడం లేదు. అయితే ఈ విషయాన్ని గ్రామపంచాయతీ వారి దృష్టికి తీసుకెళ్లగా మిషన్ భగీరథ ఓఅండ్ఎం నిధుల ద్వారా చేతిపంపుకు కొత్త పనిముట్లు బిగించి వినియోగంలోకి తీసుకువచ్చారు.

– బింగి కృష్ణమూర్తి, జాజిరెడ్డిగూడెం